తాగునీటికి కటకట

ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి, భూగర్భ జలాలు పెరిగినా ప్రజలకు దాహం తీరడం లేదు. గుక్కెడు నీటి కోసం అల్లాడిపోతున్నారు. రెండు వారాలుగా తాగునీరు రాకపోవడంతో మహిళలు నిరసన తెలిపారు. కార్యదర్శి, ఏఈల దృష్టికి తీసుకెళ్లినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని దుమ్మెత్తిపోస్తున్నారు. పంచాయతీకి వచ్చిన నిధులు ఏమయ్యాయని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

– విజయపురం

- కోసలనగరంలో రెండు వారాలు తాగునీరు బంద్
- పట్టించుకోని కార్యదర్శి, ఏఈ
- నిధులు ఏమయ్యాయి? : స్థానికులు



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

మండలంలోని కోసలనగరం పంచాయతీలో సుమారు 200 కుటుంబాలు నివశిస్తున్నాయి. 100 కుటుంబాలకు రెండు వారాలు నుంచి నీరు రావడం లేదు. దీంతో వ్యవసాయ బోర్ల నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. స్థానికంగా ఉన్న విద్యుత్ మోటార్ బోరు నుంచి వచ్చే నీరు గ్రామానికి సరిపోవడం లేదని, ఇల్లత్తూరు కుశస్థలి నది నుంచి వచ్చే నీరు కూడా అందడం లేదన్నారు. రెండు వారాలు తాగునీరు అందకపోవడంతో సోమవారం మహిళలు నిరసన తెలిపారు.

ఇంటింటికీ మోటార్లు

స్థానికంగా ఉన్న కొందరు ఇంటి ముందు గుంతలు తవ్వకొని ఒన్ హెచ్‌పీ మోటార్లు వినియోగిస్తున్నారు. దీంతో దిగువ ప్రాంతాలకు నీళ్లు అందడం లేదు. ఈ విషయం మండల, సచివాలయ సిబ్బందికి తెలిసినా అధికార పార్టీ నాయకులు కావడంతో పట్టించుకోవడం లేదు. తాగునీటి సమస్యలు ఉన్నాయని, ఏఈ, కార్యదర్శికి చెప్పినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నిధులు ఏమయ్యాయి?

పారిశుధ్యం, తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా, అది ఎక్కడా అమలు కావడం లేదు. మండలంలో నిధులు ఉన్నా.. వాటిని రాజకీయ నాయకులకు కట్టపెట్టడానికి మాత్రమే చూస్తున్నారే తప్పా.. తాగునీరు సమస్య పరిష్కారం కోసం ఖర్చు చేయడం లేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

> **రెండు వారాలుగా నీళ్లు రాలేదు**
>
> మా గ్రామానికి తాగునీరు వచ్చి రెండు వారాలైంది. ఇక్కడున్న మహిళలు, పురుషులందరూ తాగునీటి కోసం వ్యవసాయ బావి, బోర్ల వద్దకు వెళ్లతున్నాం. ఏఈ, పంచాయతీ కార్యదర్శికి చెప్పినా మా బాధలు పట్టించుకోవడం లేదు.
>
> – శేఖర్‌రాజు, కోసలనగరం

క్లుప్తంగా

విద్యార్థులు సాంకేతికత అందిపుచ్చుకోవాలి



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కార్వేటినగరం: నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగ సాధన కోసం సాంకేతికతను అంది పుచ్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. కళాశాలలో జేకేసీ ఆధ్వర్యంలో మంగళవారం కుప్పంకు చెందిన 1ఎం, 1బీ గ్రీన్ స్కిల్స్ కేరీర్ రెడీనేస్ సెంటర్ వారు కళాశాలలోని విద్యార్థుల కు ఉద్యోగ అవకాశాలు– సాంకేతిక నైపుణ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగ నియామక అధికారులు శృతి, ప్రకాష్, జేకేసీ కో–ఆర్డినేటర్ సి.ఎస్ లత, మెంటర్ లోకేశ్వర్, అధ్యాపకులు ధనంజయరెడ్డి, హరిబాబు, రఘురాం పలువురు పాల్గొన్నారు.

నాగాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కార్వేటినగరం: మండల పరిధిలోని కత్తెరపల్లి సమీపంలో వెలసిన నాగాలమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక మహిమ కలిగిన అమ్మవారిగా విరాజిల్లుతున్న నాగాలమ్మ అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పుట్టను పసుపు కుంకుమతో ప్రత్యేకంగా అలంకరించికర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారి విగ్రహాన్ని పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పమాలికతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మొక్కులు చెల్లించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం గ్రామస్తులే కాకుండా సమీపంలోని పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి పొంగళ్లు వండి, పిండి దీపాలతో నైవేద్యం సమర్పించి తమ కోర్కెలను తీర్చాలని వేడుకుంటున్నారు.

చలివేంద్రం ప్రారంభం



పన్నూరు బస్టాండులో ఏర్పాటు చేసిన చలివేంద్రం

విజయపురం : మండలంలోని పన్నూరు దళితవాడ బస్టాండులో మంగళవారం ప్రయాణికులు ప్రజల దాహం తీర్చేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్ కుమార్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. బస్టాండులో చల్లని పందిరి వేసి, నాలుగు కుండీల్లో తాగునీటి ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రతి రోజు 300 లీటర్ల నీటిని అందుబాటులో ఉంచుతామన్నారు. తాగునీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నాగయ్య, ఆశీర్వాదం, ఆనంద్‌రాజ్, గోవిందరాజ్, కశైవణన్, రామదాస్,తిరుమల,లారెన్స్,మాధవి, కీర్తి పాల్గొన్నారు.

వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్

నగరి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్ ప్రాజెక్టును ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులకు ఉద్యోగ కల్పన ధ్యేయంగా ఈ కార్యక్రమం తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. చివరి సంవత్సరం విద్యార్థులకు నైపుణ్యాలు పెంపొందించడం, జ్ఞానం, నైపుణ్యాలకు అనుగుణమైన ఉద్యోగ అవకాశాలను కలిప్పించడం, విద్యార్థులను ఉత్తమ ఎంటర్‌ప్రెన్యూయర్స్‌గా మార్చడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ శృతి, వైస్ ప్రిన్సిపల్ భాస్కర్‌రాజు, ప్లేస్‌మెంట్ విభాగం కో–ఆర్డినేటర్ పంకజ, కో–ఆర్డినేటర్ డా.మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం సుందరయ్యవీధిలోని అపోలో క్లినిక్‌లో బుధవారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు వైద్యులు ప్రతాప్, సింధు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఎన్‌టీ, చర్మ సంబంధిత సమస్యలకు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే ఈ శిబిరాన్ని చిత్తూరు వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మే 10న లోక్ అదాలత్



జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు: పుత్తూరు సబ్ కోర్టు ఆవరణలో మే 10వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఎస్.సీ.రాఘవేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల సివిల్ కేసులు, వివాహ సంబంధ మనోవర్తి, చెక్కు బౌన్స్ కేసులు, రాజీ చేసుకోదగ్గ క్రిమినల్ కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అలాగే ప్రీ–లిటిగేషన్ కేసులు (కోర్టులో పెండింగ్‌లో లేని కేసులు)సైతం రాజీ చేయనున్నట్లు వెల్లడించారు. లోక్ అదాలత్‌లో తీర్పు అంతిమ తీర్పు అని, దీనిపై అప్పీలు వెళ్లడానికి అవకాశమే లేదని స్పష్టం చేశారు. న్యాయవాదులు, పోలీసులు ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలన్నారు. కక్షిదారులు సత్వర న్యాయం కోసం జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జడ్జి కోరారు.

బాలికలకు విద్యా సామగ్రి పంపిణీ



పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న లోకనాథన్

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని బాలికల హాస్టల్లో విద్యార్థినులకు జిల్లా ఉద్యోగుల జేఏసీ కమిటీ సభ్యుడు ఎం లోకనాథన్ విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ బాగా చదువుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు.

చిన్నప్పటి నుంచే విద్యపై శ్రద్ధ పెట్టాలి



సరస్వతి పూజ చేస్తున్న విద్యార్థులు

పాలసముద్రం : పిల్లలు ప్రాథమిక స్థాయి నుంచే చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెడితే ఉన్నత స్థాయికి ఎదుగుతారని సర్పంచ్ అమరావతి తెలిపారు. టీవీఎస్ అర్ పురం ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం హెచ్‌ఎం సుధాకర్ నాయుడు, పాఠశాల చైర్మన్ గణపతి ఆధ్వర్యంలో పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరుపుకున్నారు. పిల్లలకు ఓంకారం చేసి సరస్వతి పూజలు చేసి కార్యక్రమం ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో పిల్లలు ప్రాథమిక పాఠశాల నుంచే ఇంగ్లీష్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదవాలన్నారు. అప్పుడే సమాజంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అజాగ్రత్తతోనే అగ్ని ప్రమాదాలు



మంటలు ఆర్పే విధానాన్ని ప్రదర్శన పూర్వకంగా చూపుతున్న అగ్నిమాపక సిబ్బంది

నగరి : అజాగ్రత్తతోనే అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటాయని డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం బస్టాండు ప్రాంగణంలో అగ్నిమాపక అధికారి సుబ్బరాజు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ వంటింటిలో అగ్ని ప్రమాదాలకు దారితీసే అంశాలు, విద్యుత్ సంబంధిత అజాగ్రత్తల వల్ల ఏర్పడే అగ్నిప్రమాదాలను వివరించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు అగ్నిమాపక సిబ్బంది చేసి చూపుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి ఓంశక్తి ఆలయ బైపాస్ కూడలి వద్ద కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ప్రతాప్, ప్రవీణ్‌కుమార్, మోహన్, సత్య, ప్రకాష్, రామచంద్రయ్య, కోటేశ్వరరావు, మధు, లోకయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం ఆస్తుల కబ్జాకే సవరణ చట్టం



సమావేశంలో మాట్లాడుతున్న కోదండయ్య

నగరి : ముస్లిం ఆస్తులు కబ్జా చేసి కార్పొరేట్లకి దారాదత్తం చేసేందుకే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం తెచ్చిందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య అన్నారు. పట్టణ పరిధిలోని షాదీ మహల్‌లో సీపీఐ పట్టణ నాయకులు బాషా, మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో మంగళవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. దీనికి హాజరైన ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు ఆస్తులకు సంబంధించి పూర్తి అధికారం వారికే ఉండాలని చెప్పారు. అందులో రాజకీయం జోక్యం భావ్యం కాదని వెంటనే చట్టంలో సవరణలు తేవాలని కోరారు. ఈ వక్ఫ్ బోర్డు చట్టానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమం నిర్వహించాలని భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మున్సిపల్ అధ్యక్షులు రమేష్ రెడ్డి మాట్లాడుతూ ముస్లింలకు నష్టం కలిగించే బిల్లుకు వ్యతిరేకంగా చేసే పోరాటానికి తమ మద్దతు ఉంటుందని అందరూ కలిసి పోరాడుతామన్నారు. జామియా మసీదు ముత్తువలి రఫీ బాయ్, మాజీ ముత్తువలి సంసు, తౌహీద్ జమాత్ నాయకులు రహమత్ అలీ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక మతోన్మాద ఎజెండాను అమలు చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వేలన్, శేఖర్, రవి, అహ్మదా యూనిస్, స్టార్ బాయ్, సైదలి, తౌహీద్ జమాత్ నాయకులు వర్ష అహ్మద్, యువజన సంఘం నాయకులు విజయ్ కుమార్, ముత్తు, బాబు, సురేష్, యేసయ్య, చంద్ర, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాములవారి వసంతోత్సవం



శ్రీహరిపురంలో ఊరేగుతున్న సీతారాములు

విజయపురం : మండలంలోని శ్రీహరిపురంలో మంగళవారం సీతారాముల వసంతోత్సవ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని మేళతాళాల మధ్య వీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పౌష్టికాహారం తప్పనిసరి



పౌష్టికాహారంపై అంగన్‌వాడీల మానవహారం

వడమాలపేట (విజయపురం) : గర్భిణులు, బాలింతలు ఎక్కువగా పౌష్టికాహారం తీసుకోవాలని సూపర్‌వైజర్ ప్రమీల అన్నారు. మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో మంగళవారం పోషణ్ పఖ్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు ఐరన్, క్యాల్షియం, విటమిన్లు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. ఆకు కూరలు, కూరగాయలతో పాటు మొలకెత్తించిన పప్పు దినుసులు తీసుకోవాలని చెప్పారు. పిల్లలకు పోషకాహారంతోపాటు పరిశుభ్రత పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోజా రమణి, మనీలా, ఏపీఎం మునికృష్ణ, మండల సమాఖ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది వరలక్ష్మి, రాజేశ్వరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

21 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్ : మద్యం తాగి వాహనాలు నడిపిన 21 మందికి రూ.2.10 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పు ఇచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 21 మందిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.2.10 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

ప్రతి గ్రామానికీ మినరల్ వాటర్ ప్లాంట్



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎంపీపీ హేమలతారెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం): ప్రతి గ్రామానికి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ పని చేసిందని ఎంపీపీ మహాసముద్రం హేమలతా రెడ్డి అన్నారు. గుంటిపల్లి పంచాయతీలో మంగళవారం రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహా సముద్రం దయాసాగర్ రెడ్డి, పులిగుంటీశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతి గ్రామానికి మినర్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన గ్రామాలకు కూడా మండల పరిషత్ నిధులతో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ మహాసముద్రం సురేష్ రెడ్డి, స్థానిక సర్పంచ్ మునిరత్నంరెడ్డి, వైస్ ఎంపీపీ కోదండన్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు గోవిందరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు శివలింగం, దూది శంకర్, సర్పంచ్ దూది వెంకటేష్, మాజీ సర్పంచ్ గోవిందరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, రాజారెడ్డి, సుధాకర్‌రెడ్డి, చెన్నకేశవులు నాయుడు, భూపతినాయుడు, నక్క సుబ్రమణ్యంరెడ్డి తదతరులు పాల్గొన్నారు.

జల్లికట్టు నిర్వహిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్

వెదురుకుప్పం: గ్రామాల్లో జల్లికట్టు నిర్వహించకూడదని నగరి డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ హెచ్చరించారు. మండల కేంద్రంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ సాదారణంగా జల్లికట్టు(ఎడ్లపందాలు) సంక్రాంతి పండుగ రోజు జరుపుకుంటారని తెలిపారు. అయితే తరచూ జల్లికట్టు నిర్వహించడం ద్వారా పశువులను హింసకు గురిచేస్తున్నారనే విషయాన్ని మరచి పోతున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో జరుపుకునే జల్లికట్టుకు సంబంధించి పోలీసు శాఖ తరఫున ఎలాంటి అనుమతి ఇచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యువత తప్పుడు మార్గంలో పయనించే అవకాశం ఉందన్నారు. అదే విధంగా గ్రామాల్లో ప్రతి ఏటా నిర్వహించే మహాభారత ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే సౌండ్ సిస్టంలకు ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. దీంతో పాటు ట్రాఫిక్ సమస్య పునరావృతం కాకుండా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉత్సవాల సందర్భంగా గొడవలు సృష్టించే వారిని గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. తద్వారా ఎలాంటి అవాంతరాలు ఉండవన్నారు. ఉత్సవాల నిర్వహణకు సహకరించే వలంటీర్లకు ప్రత్యేకంగా టీషర్టులు అందజేయాలన్నారు. అందరి సమన్వయంతో ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. స్మార్ట్ లాక్‌ల ద్వారా దొంగతనాలకు చెక్ పెట్టవచ్చన్నారు. వేసవిలో పిల్లలతో పాటు కుటుంబ సమేతంగా విహార యాత్రకు వెళ్లేవాళ్లు స్మార్ట్ లాక్ ఉపయోగించుకోవడం ద్వారా చోరీలను నియంత్రించవచ్చన్నారు. ఆయన వెంట ఎస్ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది ఉన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విద్యావతి

పాలసముద్రం : ఈ వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాల ని ఎంపీడీఓ విద్యావతి తెలిపారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు, మహిళ పోలీస్, సచివాలయ సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం మారుతున్న వాతావరణంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. అందువల్ల గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్యాంకర్ల ద్వారా అయినా తాగునీరు అందించాలని సూచించారు. చెత్త నుంచి సంపదపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా పేడ దిబ్బలు, ముళ్లకంపలు లేకుండా చూడాలన్నారు. నేడు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్న ప్రజాపరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇబ్బంది పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన దంపతులు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

వెదురుకుప్పం: మండలంలోని దేవళంపేటలో మంగళవారం సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని కోదండరామస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని వేడుకగా చేశారు. ముందుగా స్వామి వార్ల ఉత్సవ మూర్తులను పెళ్లి మండపానికి తీసుకొచ్చి వేంచేపు చేశారు. పట్టుపీతాంబరాలతో పాటు సుగంధపరిమళాలు వెదజల్లే పుష్పాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. అనంతరం అర్చకులు సంప్రదాయ పద్ధతిలో స్వామి వారి కన్యాదానం చేశారు. సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రాల నడుమ స్వామి అమ్మవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో దంపతులు పాల్గొని స్వామి వార్ల ఆశీర్వచనం అందుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు పరవశించిపోయారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆలయ ధర్మకర్త ఎమ్మిడి కిషోర్, కార్యదర్శి సుకుమార్, అధ్యక్షులు ధీరజ్ పాల్గొన్నారు.